

ఆకలి తప్పు దారుల్ని వెతుక్కోవచ్చు.
కానీ ఆ మార్గం వంశపారంపర్యం కాకుండా
చూడాల్సిన బాధ్యత వ్యవస్థ మీద ఉంది.

సన్నపరెడ్డి వెంకటరామిరెడ్డి

# 6 అతడి బాధ





వెలగచెట్టు కింది బిడువులో వున్న తల్లికోడి మెడ పైకెత్తి గాల్లోకి చూస్తూ పిల్లల్ని హెచ్చరిస్తోంది. పిచ్చుక బుర్రుమని ఎగిరినా 'కొక్కొక్...' మంటూ తను అరవటం, పిల్లలు జాగ్రత్తపడటం కనిపిస్తూ వుంది.

మిద్దె పంచెలో కూచుని వార్తాపత్రిక తిరగేస్తూ ఓ కన్ను అటువైపు వేసి వుంచాను. ఇంటి ముందరి వేపచెట్టు కింది అరుగు మీద పులిజూదం ఆడే జనాల సవాళ్లు, ఎగతాళి మాటలు జోరుగా వినిపిస్తున్నాయి.

కాలం చాలా భారంగా పుష్యమాసం ముంగిట్లోకి నడిచి వచ్చింది. కరువు బరువు అడుగు ముందుకు పడనీయటం లేదు. అది వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ఆర్ద్రంగా వచ్చి వుంటే- కళ్లాల నిండా పండు మిరపల తివాచీలతో, మిద్దెల పైన ఎండబోసిన అలసంద పెసరగాయలతో, వరిపంట కళ్లాలతో, ముదరొచ్చిన చింత గెలలతో పల్లెలు ఘనంగా స్వాగతం చెప్పి వుండేవి. కరువును వెంట బెట్టుకొచ్చింది కాబట్టి- బీడు భూములు, వూపముల్లులు, పల్లేరు కాయలు, భూతరాకాశులు పరచిన దారులు దిక్కయ్యాయి. సగం వూర్ల జనం కడుపు చేత బట్టుకొని నగరాలకు వలసలు పోగా మిగిలిన ముసలీ ముతకా అరుగుల మీద ఆటలతో పొద్దుపుచ్చుకొంటున్నారు.

పత్రిక నిండా నక్సలైట్ల ఎన్‌కౌంటర్ వార్త. ఎక్కడో రాష్ట్ర సరిహద్దుల్లో ఎదురు కాల్పుల్లో చనిపోయారని పోలీసు పెద్దల ప్రకటన.

పేపర్ మూసేసి ఈజీ ఛైర్‌లో వెనక్కి వాలి కళ్లు మూసు కొన్నాను.

ఉన్నట్టుండి కోడి అరుపులూ, ఆ వెనకే ఇందిర 'హోయ్... హూయ్...' అంటూ పక్షుల్ని బెదరగొట్టే అదిలింపులు.

ఉలిక్కిపడి నిటారుగా అయి అటుకేసి చూశాను.

పోరు అరుపులు అరుస్తూ గాల్లోకి ఎగిరి కాకిని వెంబడిస్తూ వుంది తల్లికోడి.

ప్రమాదాన్ని పసిగట్టిన ఇందిర బెదిరింపు కేకలతో అటుకేసి వెళ్లటంతో రెండవ కాకి చెట్టుకొమ్మల్లోంచే కపటపు చూపులు చూస్తూ వుంది.

ఈలోపు తల్లికోడి వచ్చి పిల్లల ముందు వాలి, తన రెక్కల విసుర్లకు దూరంగా ఎగిరిపడిన పిల్లల్ని దగ్గరకు చేర్చుకొంటూ వుంది.

ఓవైపు వెలగచెట్టు, మరోవైపు వేపచెట్టు, మధ్యలో టెంకాయ చెట్లు పందిరి కట్టినట్టు పెరిగి వుండటం వల్ల బిడువులోని కోడి పిల్లల మీద గద్దలు దాడిజేసే పరిస్థితి లేదుగాని కాకులపోడు తప్పటంలేదు.

కాకులు మహా టక్కరివి. కూడబలుక్కొని జంటగా వచ్చి దాడి చేస్తాయి. పిల్లల కావరంతో కన్ను మిన్ను గానక ఒక కాకిని తల్లికోడి వెంబడించగా, రెండవ కాకి వచ్చి ఓ పిల్లను నోట కరుచుకుపోతుంది.

వీటి కంటే ప్రమాదకరమైంది. సాలువ ఉండటానికి పావురమంత కూడా కనిపించదు. చెట్లకొమ్మల చివర్లదాకా వచ్చి అక్కన్నించి తుపాకిగుండులా అత్యంత వేగంగా దూసుకొచ్చి కోడిపిల్లను తన్నుకుపోతుంది. దాన్ని ఆపటం ఎవ్వరి తరమూ కాదు. చెట్లకొమ్మల్లోని పిచ్చుకల్ని సైతం వేటాడేంత నేర్పరి అది.

కాకుల క్రూరత్వాన్నీ, తల్లికోడి చేతగానితనాన్నీ గొణుక్కొంటూ ఇంట్లోకి వచ్చింది ఇందిర.

"రవ్వంత కోడిపిల్లల్ను కనిపెట్టుకోనుండు సామీ!" చెబుతూ లోపలికి వెళ్లింది.

సెలవురోజు వస్తే నాకిది అదనపు బాధ్యత.

ఈ సంఘటనలన్నీ సర్వసాధారణం కాబట్టి అరుగుమీది వాళ్లెవరూ తలెత్తి కూడా చూడలేదు. ఆటల్లోంచి బైటకు రాలేదు.

కొంతసేపయింతర్వాత వాళ్ల వద్ద నుంచి నాకు పిలుపులు మొదలయ్యాయి.

పులుల్ని నిలువరించలేక పోతున్నారు కాబోలు.

నేను వెళ్లగానే తావిచ్చి మేకల రాళ్లు నా చేతిలో పోశారు.

మంచి మంచి ఎత్తులతో మేకల్ని చాకచక్యంగా నడిపించి, పులుల్ని కట్టేయడంలో నేర్పరిని కాబట్టి నాకిక్కడ గౌరవం.

ఆట మొదలైంది.

ఎనభై ఐదేళ్ల సెవ్వన్న వచ్చి ఆటవద్ద నిల్చున్నాడు.

ఆటలోకి కళ్లు చికిలించి చూస్తున్నాడు.

అతనెప్పుడూ మేకలవైపే. పులుల్ని కట్టేశామంటే చాలు- ఓ పొడిదగ్గు దగ్గి, ఔడుగరచి, మీసం వద్ద చెయ్యేసి, 'చూడు మా దెబ్బ' అన్నట్లుగా కళ్లెగరేస్తాడు. ఆ హావభావాల్ని చూస్తే చాలు పులుల్ని జరిపే రామయ్యకు ఒళ్లుమంట.

“ఎవురో ఆడితే యికిలియ్యడం గాదు- నువ్వు కట్టేజ్జూరా మొగోనివైతే,” అంటూ సవాల్ చేస్తాడు ఉక్రోషం పట్టలేక.

“నీ పాసుగుల్ల గదబ్బే! నీ పాయాన నల్లమల కొండల్లో పెద్ద పులుల్తో కలబడ్తాన్నె... యీ రాల్లపులులు ఒక లెక్కా?” అంటాడు సెవ్వన్న.

ఇద్దరి సవాళ్లు అందరికీ నవ్వు తెప్పిస్తుంటాయి.

రెండవ ఆట మొదలైంది.

వేటరాళ్లల్లోనే పులుల్ని ఇబ్బందిపెట్టాను.

“మా రెడ్డితో ఆడే మొగోనివా?” అంటున్నాడు సెవ్వన్న.

అంతలో ‘థోయ్... థోయ్...’ అంటూ జంతువుల్ని బెదిరించే శబ్దాలతో ఇందిర అదిలింపులు వినిపించి ఉలికిపాటుగా వెలగచెట్టు కేసి చూశాను.

రెండు రెక్కల్ని బుట్టలాగా పొంగించి, ఈకల్ని నిటారుగా చేసి ‘కొక్కొక్కొ...’ అని భీతావహంగా అరుస్తూ తల్లికోడి తన పిల్లల మీదకు రాబోతూ వున్న కుక్కను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతూ వుంది. సుడిగాలికి తిరిగే ఎండుటాకుల్లా కాళ్ల చుట్టూ బుర్రుబుర్రున పరువెడుతూ వున్న బుల్లి పిల్లల్ని వెనక్కి నెడుతూ తను ముందు నిలబడే ప్రయత్నంలో- సమర్థుడైన కూతగాడు కబడ్డీ ఆట ఆడినట్లుగా విన్యాసాలు చేస్తోంది. అట్లని ధైర్యంగా కుక్కను ఎదుర్కోలేకపోతోంది- అది నోట కరచి చంపేస్తుందని.

వెంటనే నేలకు వంగి చేతికి దొరికిన రాతిని పట్టుకొని తాపత్రయంతో గట్టిగా కేకేస్తూ కుక్కకేసి విసిరాను. “తిరుక్కోండ్రా- దీన్నియ్యాలనేల బడగొట్టాల...” అంటూ ఇంకో రాతిని అందుకొన్నాను.

అరుగు మీంచి కిందకు దిగి రాళ్లు తీసికొని ముందుకొచ్చారు ఇద్దరు మనుషులు.

మూడువైపుల ప్రహరీ గోడ వుంది. నాలుగవ వైపు దారిని మేము అడ్డగించాము.

కుక్క బెదరి ఇటు రాబోయి- పరిస్థితి అర్థమై వెనక్కి తిరిగి, అటు ఇటు జురుకుల్లాడి చివరకు చావు తెగింపుతో ఐదడుగుల ప్రహరీగోడను బోర్లించి వున్న గంప ఆసరాగా ఎగిరి అవతల దూకి కుయ్యోమంటూ పారిపోయింది.

మమ్మల్ని చూసి పకపక నవ్వాడు సెవ్వన్న.

“మీకు దొరుకుతాదా రెడ్డే?” అన్నాడు. “యేడాది నుంచి చూస్తాండ... పుట్టిన కోడిపిల్లనల్లా ఎంటాడి తింటాంది. ఒక్క మొగోనికి కూడా సుక్కుమన్లే... రొవ్వొంతన్నా పౌర్సం రాలే... కుక్కను సంపలేకుండారు...” ఈసడింపుగా అన్నాడు.

''ఇన్ని మాటలు మాట్లాడ్తవే... నువ్వు సంపగూడదా? నువ్వు మొగోనివి గాదా?'' రామయ్య అన్నాడు.

''సూస్తాండు- ఎప్పటికైనా దాన్ని నేనే సంపాల,'' సెవ్వన్న అన్నాడు మీసం దువ్వుతూ.

కోడిపిల్లను పోగొట్టుకొన్నపుడల్లా సాయంత్రం గొణుగుళ్లతో కూడిన ఇందిర వేదనలో కుక్క అరాచకత్వాన్ని వూహించుకొంటున్నానేగాని యీరోజు ప్రత్యక్షంగా చూశాను. ఇందిర స్థానంలో నిలబడి ఆలోచిస్తే నాక్కూడా శోకంతోబాటు కుక్క మీద కోపం ముంచుకొచ్చింది.

గతంలో కుక్కలెప్పుడూ ఇంటి కోళ్లను తినేటివి కాదు.

కోళ్లనే కాదు- గొర్లదొడ్డి వద్ద గూళ్ల కింది గొర్రెపిల్లల్ని కూడా కొరికి చంపుతున్నాయిట. నాలుగైదు కుక్కలు కలిసి ఒంటరి గొర్రెనో, మేకనో నేల పడదొబ్బి పొట్ట చీల్చుతున్నాయిట. గొల్లలు కూడా వాపోతున్నారు.

ఊరకుక్కల్లో ఈ హింసా ప్రవృత్తి ఎట్లా ప్రవేశించిందో అర్థం కావటం లేదు.

ఉదయం ఎనిమిది గంటల సమయాన బడికి వెళుతూ వున్న నాకు కుంట కట్ట మీద ఎదురయ్యాడు సెవ్వన్న. చేతిలో నల్లటి పాలిథిన్ సంచి వేలాడేసుకొస్తున్నాడు.

బండిని ఆపి ఏమిటన్నట్లుగా చూశాను.

చిన్నగా నవ్వాడు అతను. ''తెస్తాండ... ఆ కుక్కను సంపంది వొదిలేదిలే... కటికంగడి కాడ కోడి పొట్ట పేగులు కసురూ తెస్తాండ... గులికెల మందు కలిపి పెడ్తా. తారుమని సావాల. ఇన్రోజులూ ఎందుకులే అనుకున్నే... పాపమని వొదిలి పెట్టినా... నా కోడిపిల్లల్నే... వంద పిల్లల్ను తినింటాది... వంద... సంపితే పాపమా?'' చివర ప్రశ్నతో నాకేసి సూటిగా చూశాడు.

సమాధానంగా చిన్నగా నవ్వుతూ బండి కదిలించి ముందుకు సాగాను.

సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఉత్సాహంగా కనిపించాడు సెవ్వన్న. ప్రహరీ గోడకు ఆనుకొని నిలబడి, ''రెడ్డే!'' అని నన్ను సంబోధిస్తూ అరుగు వైపు తిరిగి గట్టిగా దగ్గాడు. రామయ్య ఇటువైపు చూడగానే ఔడు గరచి మీసం మెలేసి, ''సంపినా దొరా! పైటేలకే దాని పీడ వొగదెంచినా...'' అన్నాడు బిగ్గరగా.

''కోడి పేగులకు గులికెల మందు పాడుబాయి గడ్డన పెట్టినా. ఎప్పుడు తినిందో ఏమో... జెయిగాడు సెప్పె... వాగులోబడి తనకలాడ్తాన్నెదంట... యీ వీధికి పట్టిన పీడ వొగదెంచినా... సంపినా...'' అన్నాడు.

రామయ్య నవ్వుకొంటున్నాడు.

నాక్కూడా సంతోషం కలిగింది.

మనస్సు తేలికబడింది.

ఎన్ని కోడిపిల్లల్ని తినిందనీ అది! మొండిగా దూసుకుపోయి తల్లికోడిని లెక్కజేయకుండా రెండు మూడు పిల్లల్ని ఒకేసారి నోట కరుచుకొని పోతుంది.

ఇరవైరోజులకు పైగా గుడ్లు పెట్టటం, ఇరవై ఒక్కరోజులు పొదగటం, పిల్లల్ని లేపటం, పదిరోజుల్లోనే కుక్క నోటబెట్టటం...

గుడ్లు పెట్టేందుకు తావులు కల్పించాలి. పెట్టిన గుడ్డును ఏ రోజు కారోజు బానల్లోనో, ఫ్రిజుల్లోనో దాచాలి. కోడి పొదుగుకు రాగానే పాత గంపలో చెత్త చెదారం వేసి పొత్తిళ్లు తయారుచేసి గుడ్లన్నీ దానిమీద పేర్చి కోడిని అందులో పొదగబెట్టాలి.

గుడ్లను గంపలో పొందించేటపుడు ఇందిర హడావిడి చూడాలి. పాడి తయారుచేసిన తర్వాత నన్ను రమ్మంటుంది. నా చేత్తో గుడ్లు పొదిగిస్తే పిల్లల్ని బాగా లేపుతుందిట కోడి. నేను కాదనలేక గుడ్లన్నిటినీ గంపలో పేరుస్తాను.

పిల్లల్ని లేపింతర్వాత గుడ్ల పెంకుల్ని ఏరివేసి, పిగలని గుడ్లను చెవికాడ వూపి, లోపల పిల్ల అరుపు వినిపిస్తుందేమోనని పరిశీలించి, లొడలొడ వూగితే అది మురిగిపోయిన గుడ్డుగా లెక్కేసి పక్కన పడేసి... అదో లోకం ఆమెకు. అట్లా ఏడాది పొడవునా పిల్లల్ని లేపించటం... కుక్క నోటబెట్టటం... చాలా బాధగా వుండేది.

గ్రామస్తులు అనేవాళ్లు, "నీకెందుకమ్మా యీ గొడవంతా! ఉద్యోగస్తులయి వుండీ యీ కోళ్ల సాకడం, గొడ్ల మేపడం అవసరమా!" అని.

నేను కూడా చాలాసార్లు ఆ మాటతోనే ఇందిరను పొడిచి వుంటానుగాని- మాంసం కోసమో, అమ్మి సొమ్ము చేసికొనేందుకో ఆమె కోళ్లను సాకటం లేదనే విషయం నాకెప్పుడో తెలుసు.

పిల్లలంతా చదువులకు వెళ్లిపోయిన తర్వాత ఇంటి దగ్గర ఒంటరితనాన్ని పోగొట్టుకొనేందుకు తనకో ప్రత్యేక లోకం సృష్టించుకొనే క్రమంలో యీ కోళ్ల సాకటం ఒకటి ఏర్పడింది. మనుషులతో మాట్లాడినట్టే వాటితో మాట్లాడుతుంది. బుజ్జగిస్తుంది, గద్దిస్తుంది, పిలుస్తుంది. తరుముతుంది, జాగ్రత్తలు చెబుతుంది. వాటిల్లో ఒకదానిగా మారిపోవాలని చూస్తుంది.

కోళ్లను అంత గాఢంగా ప్రేమించే ఆమెకు కుక్క మీద అంతులేని కసి ఏర్పడటం సహజం... ఆమె వల్ల నాకు కూడా.

సెవ్వన్న పుణ్యాన ఇప్పుడా బాధ తీరింది.

కాటికి కాళ్లు చాచే వయస్సులో ముసిలోని పట్టుదల నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ వుంది.

చీకటి పడిన తర్వాత సెవ్వన్న వచ్చాడు. "దొరా!" అంటూ కర్ర వూతేసుకొని. జాగ్రత్తకోసం తప్ప నడక సహాయానికి కాదు కర్ర.

"పాపంలో పడేట్టుండానే..." అన్నాడు.

"ఏమీ?" అడిగాను.

"ముందన్నా చెప్పలే జెయిగాడు... ఇప్పుడనె... పిల్లల తల్లెంట అది... నిన్ననో మొన్ననో యీనుకొన్నెదంట... పిల్లలు కండ్లుగూడా తెర్సలేదంట... పాడుబాయి గెట్టిన కంప సెట్లల్లో రోంత దిబ్బ వున్లే... దాంట్లో పాది జేసుకొని యీనుకొన్నెదంట... అదంటే దుర్మార్గరాలు... సంపినా పాపంలే... పిల్లలెట్టా?" అంటూ జయన్న ఇంటికేసి కదిలాడు.

నేను చూస్తూ వుండిపోయాను.

కొంతసేపయింతర్వాత వెనుదిరిగి వచ్చి, "పలకలే నా కొడుకు... కుక్కపిల్లల్ని తీసి గంపకిందన్నా బెయ్యమన్నే... వేరే కుక్కలు చూస్తే కొరికి సంపుతయి. రేత్తిర్లు పందికొక్కుల కండ్లబన్నే కొరుకుతాయి... ఎట్ట జెయ్యాలబ్బా?..." అంటూ గొణుక్కొంటూ ఇంటికెళ్లాడు.

నేను కూడా కొంత అయోమయంలో పడ్డానుగాని అరుగు మీద కూచున్న తర్వాత మరచిపోయాను.

ఇంకా ఎవ్వరూ అరుగు వద్దకు రాలేదు.

తిండి తినిగాని రారు.

"సందాకవలమమ్మా!" అంటూ భిక్షగత్తెలు ఇల్లిల్లూ తిరుగుతున్నారు.

టీవీల ముందున్న ఆడవాళ్లు ఇళ్లల్లోంచి బైటకు రాలేదుగాని వీధి కుక్కలు మాత్రం గయ్యిన మొరుగుతూ వాళ్లను ఇబ్బంది పెడుతున్నాయి.

అర్ధగంటసేపు కూడా గడవకుండానే తిరిగి అరుగు వద్దకు వచ్చాడు సెవ్వన్న.

అరుగు మీద పిర్ర మోపాడు.

రెండు నిమిషాలు కూడా కుదురుగా కూచోలేదు. లేచి నిల్చుని, "ఎట్ట జెయ్యాల దొరా!" అన్నాడు నాకేసి తిరిగి.

"ఈ పాయాన నా మెడకు సుట్టుకుండెనే..." అంటూ బాధపడ్డాడు.

"ఆ నా కొడుకు జయిగాడు పలకడంలే... ఇంగొకనితో అయ్యే పని గాదు అది... ఆ ఎలితావు లోతావు వానికే తెలుసు. వానింటికాడి పాడుబాయి మరుగు..."

"ఈ జామున ఎవురికైనా కష్టమేలే... చీకటి గదా!" అన్నాను.

"చార్జింగ్ లైట్లుండేదేం రెడ్డే..." చెప్పాడు.

అంతలో జయన్న గొంతు వినిపించి, "ఒరే నాయినా జయన్నా!" అంటూ అటుకేసి నడిచాడు. "నీకు పున్నెముంటాదిరా... ఆ కుక్కపిల్లల్ను బైటికి తీసకరారా! గంపకింద బేజ్జాంరా..." అన్నాడు.

"ఏందిబ్బా వాటెను సాకేది! వాటెమ్మ దొంగనాకడకల్ది. ఎన్ని కోడిపిల్లల్ను తిన్నెదో లెక్కలే... బిడ్డలు మాత్రం పసవర్లయితాయా!... సావనీలే..." అంటూ వెళ్ళిపోయాడు.

"ఎట్టజెయ్యాలబ్బా! యిడ్సిపెడ్తే బతకవే... నా సేతులారా నేనే సంపితి... నా బాధ నా కసి అమ్మను సంపితే- పసిపిల్లల్ను నేనే సంపితి," అంటూ ఇంటికేసి నడిచాడు సెవ్వన్న.

అతని బాధ నాకు అర్థమవుతూ వుంది.

అర్థం కానిదల్లా- వూరకుక్కల్లో యీ హింసా ప్రవృత్తి, వేట మనస్తత్వం ఎట్లా ప్రవేశించిందా అని.

ఆ విషయాన్నే సెవ్వన్నను అడిగాను తిరిగి రాగానే.

"తిండి దొరక్కనే..." వెంటనే చెప్పాడు అతను.

నేను కొంత అయోమయంగా చూశాను.

"పదేండ్ల కిందటి దాకా ఇంటికొక కుక్కను పెంచుకుంటాంటిమి. అది ఇంటికి కావిలుంటాండె. చేలకాడికి తోడొస్సాండె. గొర్లున్నోడంతా రొండు కుక్కల్నన్నా పెంచుకొంటాండె. నక్కలు తోడేళ్ల బాధ నుంచి అవి తప్పిస్సాండె. ఇప్పుడు కుక్కల్ను సాకే వాల్లేరీ? పారిగోడలు కట్టుకొని గేట్లు బిగించుకొని కుక్కల్ని ఇంట్లేకి రానియ్యక పోయిరి. తిండి తినేప్పుడు కుక్క వాకిట్లేకి వొచ్చి తొంగి సూస్సాండే. ఒక్క పిడచన్నా బేస్సాంటిమి. ఇప్పుడది వాకిట్లేకి వచ్చేదానికి లేకపాయె. కొట్టాలు గుడిసెలు వున్నెప్పు డయితే మనుసుల్లేనెప్పుడు తడికెల వాకిలి కొరికి ఇంట్లో జొరబడి కుండల్లో కూడు తినిపోతాండె... నక్కలు తోడేల్లు కులనాశినమై పోయినాంక గొల్లోల్లు కూడా కుక్కల్ను సాకడం సాలించిరి. వేట మరిగిన కుక్కలు యాడ వూరుకుంటాయి. పెద్దనక్కలు తోడేండ్ల బదులు కుక్కలే గొర్రెల్ను యాటాడబట్టినయి. మాసులిప్పుడు గేట్లు బిగించుకొని కుక్కల్ను ఇంట్లేకి రానియ్యకపోడమే కాకుండా చెంబు పట్టుకొని దాంకకు పొయ్యేది కూడా లేకపాయె. అంతా ఇంట్లోనే కానిస్సాండిరి. అవి ఎట్ల బతకాల?

వూరకుక్కలు కోళ్లను తినబట్టినయి. గొర్లకాడి కుక్కలు గొర్రెపిల్లల్ని, గొర్లను గూడా సంపబట్టినయి. రాబోయే కాలంలో కుక్కలే నక్కలు తోడేళ్ల మాదిరి మారిపోతాయేమో!'' చెప్పాడు.

అతని విశ్లేషణ నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఆదిమానవుడి నుండి ఇప్పటిదాకా కుక్కల్ని మచ్చిక జేసికొని సాగిన మనిషి ప్రయాణం కాస్తా ఇప్పుడు కుక్కల్ని తన నుంచి దూరం చేసికొనే దిశగా సాగుతోంది. టౌన్లలో, కొన్ని పల్లెల్లో కుక్కల్ని విషప్రయోగంతో సామూహికంగా చంపుతూ వున్న వార్తల్ని వింటున్నాం. భవిష్యత్తులో మనిషి కుక్కల్ని సంపూర్ణంగా గ్రామాల్లోంచి తరిమి వేయగలడేమో! అవి కూడా జనావాసాల్ని వదలి క్రూరజంతువులుగా మారతాయేమో! మెడకు గొలుసులతో, ప్రహరీ లోపల కుయ్యి కుయ్యిమనే సీమకుక్కలే రేపటి తరం కుక్కలుగా చెలామణి అవుతాయేమో!

తిండి తిని ఒకరొకరుగా అరుగు వద్దకు వస్తున్నారు జనం.

అరుగు మీద కూచుని లోకాభిరామాయణాలు మొదలెట్టారు.

ఇంటిదాకా వెళ్లి తిరిగి వచ్చాడు సెవ్వన్న.

ఇంటి వద్ద అతని పానం నిలువనట్టుంది.

'' కాలానికి ముసిలోడు పాలెగాడబ్బా! అంత మాయదారి కుక్కను దెబ్బకు సంపిండు...'' సూరయ్య అన్నాడు.

''ఏం పాలెగానితనమో తీ... దానికి నేదరి పిల్లలుండాయంట. కండ్లు గూడా తెర్సని పిల్లలు... పాపం జుట్టుకొనె...'' సెవ్వన్న అన్నాడు.

''సిన్నప్పుడు పిల్లిని జంపి పాపం సుట్టుకొంటాదని బయపడి దాని సెవ్వు కాల్చుకొని తిన్నెవంటనే... నిన్ను సెవ్వన్న అనేది అందుకేనంటనే...?'' సూరయ్య ఎకసక్కెంగా అన్నాడు.

''అంటే... ఇప్పుడు ముసిలోడు కుక్కసెవులు తినాల్నా?'' అని సుబ్బయ్య అనటంతో అందరూ పకపక నవ్వారు.

వాళ్ల వ్యంగ్యాన్ని భరించలేకపోయాడు కాబోలు. ''దాని పిల్లల్ని కోసక తింటేగాని నాకు పాపం పోదు...'' అని కొంత బాధతో మరికొంత రోషంతో అంటూ అక్కన్నించి వెళ్లిపోయాడు.

మరికొంతసేపు యవ్వారం తర్వాత చలి ఎక్కువ కావటంతో ఒకరొక్కరే అరుగు దిగి ఇళ్లకు వెళుతున్నారు.

నేను కూడా ఇంట్లోకెళ్లి టీవీ ముందు కూచున్నాను.

ఎన్‌కౌంటర్‌లో చనిపోయినవారి తల్లిదండ్రులు, పెళ్లాం పిల్లలు గగ్గోలు పెట్టే దృశ్యాలు మళ్లీ మళ్లీ ప్రసారమవుతున్నాయి. పట్టుకొని కాల్చి చంపిన పోలీసుల మీద కేసు నమోదు చేయాలనీ, చనిపోయినవారి కుటుంబాలకు ఆర్థిక సహాయంచేసి ఆదుకోవాలనీ ప్రజాసంఘాలు ఆందోళన చేస్తున్నాయి.

"రెడ్డే!... ఓ రెడ్డే!" బైట్నించి పిలుపు.

పంచలోకి నడిచాను.

గేటువద్ద సెవ్వన్న.

"బాయిగడ్డ మీది కంపసెట్లల్లోంచి కుక్కపిల్లల అరుపులు నీకు యినబల్లేదా సామీ?" అడిగాడు.

కొంత నిశితంగా చెవులు రిక్కించి విన్నాను.

అటువంటి శబ్దాలేవీ వినబడలేదు.

"కుయ్యో కుయ్యోమంటూ వాటి అరుపులు సెవుల్లో గుయ్యిమంటా మోగుతండాయి. పండుకుంటే కండ్లు మూతలు పడ్డలే దొరా!" అన్నాడు.

అతనికేసి తదేకంగా చూశాను. అతని బాధ నాకు అర్థమవుతూ వుంది. అర్థం కానిదల్లా- అతని కోపాన్నీ, కసినీ, కుక్కను చంపాలనే క్రూరత్వాన్నీ అతనిలాగే అనుభూతించిన నాకు, అనాథలైన కుక్కపిల్లల పట్ల అతనిలో పొంగివచ్చే కారుణ్యాన్ని అతనిలాగే ఎందుకు అనుభూతించలేకపోతున్నాను- అని.

నేనే కాదు- అరుగు వద్ద జనాలందరు కూడా.

సెవ్వన్నను వెంటేసుకొని జయన్న ఇంటివద్ద కెళ్లాను.

"ఒరే జయన్నా!" లైటేసి పిల్చాను.

రెండు పిలుపుల తర్వాత పలికాడు.

"ఏం సారూ?" అంటూ వచ్చాడు.

"ఇదో యీ టార్చిలైటుతో పోయి ఆ కుక్కపిల్లల్ను పట్టకరా పో," చెప్పాను.

"ముసిలోడు ముసిలోడు గాదబ్బా!" గొణుక్కొంటూ లైటు తీసికొన్నాడు వాడు.

పది నిమిషాల తర్వాత నాలుగు కుక్కపిల్లల్ని రెండు గబ్బిళ్లతో పట్టుకొని వచ్చాడు.

వాడి చంకలోని లైటును నేను అందుకొన్నాను.

"వాటెను గంపకింద చెయ్యి నాయినా! పున్నెముంటాది," సెవ్వన్న చెప్పాడు.

"నాకు పున్నెమొద్దు పాపమొద్దు. ఆ పన్జెప్పగాకు..." గయ్‌మన్నాడు వాడు.

కర్రను చంకలో యిరికించుకొని కుక్కపిల్లల్ని అందుకొన్నాడు సెవ్వన్న.

"ఇగ నాకు నిద్దరొస్చాది దొరా!" అంటూ తన ఇంటికేసి కదిలాడు.

అరుగు వద్ద నిల్చుని అతను వెళ్లిన దిశకేసే చీకట్లోకి చూస్తూ వుంటే ఉన్నట్టుండి నా ఒళ్లంతా జలదరించింది. కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగి జలజల రాలాయి.

'ముసిలోడా ఓ ముసిలోడా! పాతకాలపు ముసిలోడా! పురాతన మానవుడా! గుండె తడారని మనిషీ! ఎద్దుల్ని పెద్దకొడుకులుగా, బర్రెల్ని ఆడబిడ్డలుగా, పిల్లుల్ని చంటిపిల్లలుగా, కుక్కల్ని ఆత్మబంధువులుగా, చెట్లను దేవతామూర్తులుగా చూసికొనే తరానికి చెందిన ముసిలోడా! మా గుండెలు తడారి ఎడారిగా మారాయి తండ్రీ!' ఎదలో ఘోష మొదలైంది.

రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు నాకు.

ఉదయం ఆలస్యంగా లేచాను.

సెవ్వన్న గుర్తొచ్చి అతని ఇంటి వద్దకు నడిచాను.

మిద్దెగోడకు ఆనించి నిలేసిన వారపాకలో తడికల గోడల నడుమన నేల మీద కాళ్లు బారజాపి కూచుని, నాలుగు పిల్లలూ ఒడిలో పాకుతూ పాలకోసం వెంపర్లాడుతూ వుండగా, ఒక్కోదాన్ని జాగ్రత్తగా పట్టుకని పాలసీసా పీకను నోట్లో పెట్టి పాలు తాపుతున్నాడు సెవ్వన్న.

అప్పుడే ఈనుకొన్న నలుగురు పిల్లల తల్లిలా వున్నాడు.

"పొద్దున్లేసినాన్నుంచీ ఆకలో ఆకలో అని ఒకటే మొత్తుకోలు... పాలు కొనక్కొచ్చినా," చెప్పాడు. "ఉండే నీ పాడుగానూ... దాన్ని తాగనీ... మీ యమ్మకున్నెట్టు దండిగా రొమ్ములేడ తేవాల?" అంటూ కుక్కపిల్లల్ని సముదాయిస్తూ, "యిదో... యీ సీసా పాల పీకె గొల్లోల్ల నడిగి యిప్పించకొచ్చినా... ఇంగో సీసన్నా లేకుంటే నా పానాలు తీసేట్టుండాయి," అంటూ మరొక పిల్లకు పీకను అందించాడు.

మళ్లీ నా కళ్లల్లో నీళ్లూరి గుడ్లనిండా కమ్మి అక్కడి దృశ్యం మసకబార జొచ్చింది.

సాయంత్రం బడి నుంచి ఇంటికి తిరిగొచ్చేసరికి సెవ్వన్నకు తోడుగా ఇందిర కూచుని పిల్లలకు పాలు తాగిస్తూ కనిపించింది.

మరో వారంరోజులకు ఆ వీధి ఆడవాళ్లందరూ వాటికి తల్లులయ్యారు.

టీవీ వార్తల్లో ప్రజాసంఘాల ఆందోళనలు జరుగుతూనే వున్నాయి- ప్రభుత్వం చంపేసిన తీవ్రవాదుల కుటుంబాల్ని ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలని.

ఆందోళనల్ని కూడా లాఠీలు కర్కశంగా అణచివేస్తున్నాయి.

ఈ విషయంలో ప్రభుత్వం కన్నా మా సెవ్వన్న మేలేమో!

*తెలుగుపలుకు - తానాసభల జ్ఞాపిక*
*2017*

*



16 ఫిబ్రవరి 1963న కడప జిల్లాలో జన్మించారు. మొదటి కథ కడితి వేట 1987 ఆంధ్రపత్రికలో అచ్చయింది. దాదాపు వంద కథలు రాశారు. కొత్త దుప్పటి, బతుకు సేద్యం కథా సంపుటాలు, ఆరు నవలలు ప్రచురించారు. కొన్ని కవితలు అచ్చయ్యాయి. కాడి నవలకు ఆటా బహుమతి, ఒంటరి నవలకు 2017లో తానా బహుమతి లభించాయి.

*చిరునామా: బాలరాజుపల్లె, నరసాపురం పోస్ట్ కాశినాయన మండలం,*
*కడప జిల్లా - 516 217. ఫోన్: 94412 87865*
*sannapureddy12@gmail.com*